పడకేసిన పారిశుధ్యం

- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త. వ్యర్థాలు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- పట్టించుకోని అధికారులు
- విజృంభిస్తున్న వ్యాధులు



కోటనందూరు తాండవ నదిలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

కోటనందూరు: పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురికినీటిలో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లను శుభ్రం చేయకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. రోడ్లపై పేరుకుపోయిన మురుగు, చెత్తలో పందులు, క్రిమికీటకాలు తిష్టవేసి కలుషిత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. పల్లెల్లో తాండవిస్తున్న అపరిశుభ్రత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్య పనులను సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్య పనులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడివడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

17 పంచాయతీల పరిధిలో..

కోటనందూరు మండలంలో 17 గ్రామ పంచాయతీలున్నాయి. సుమారుగా 70 వేల మంది ప్రజలు ఉన్నారు. ఆయా పంచాయతీల్లోని డ్రైనేజీల్లో సంవత్సర కాలంగా పూడిక తొలగించకపోవడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. మురుగు రోడ్లపై ప్రవహించడంతో అధ్వానంగా మారుతున్నాయి. అవసరం మేర క్లాప్‌మిత్రాలు లేకపోవడం, ఉన్నవారిపై సైతం పనిభారం పెరిగిపోవడంతో గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. రోజూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో రోడ్లను ఊడ్చే పరిస్థితి కనిపించడం లేదు. అరకొరగా ఊడ్చిన చెత్తను గ్రామ శివార్లు, కాలువల్లో డంపింగ్ చేస్తున్నారు. మండల కేంద్రం కోటనందూరులో సేకరించిన చెత్తను తాండవ నదికి తరలించి నదిని కలుషితం చేస్తున్నారు.

అలంకార ప్రాయంగా సంపద కేంద్రాలు

మండలంలో 14 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. వీటి లక్ష్యం సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా విడదీసి, రీ సైకిల్ చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చడంతో పాటు ఆహ్లాదకర వాతావరణం సృష్టించడం. కాగా ఏ గ్రామంలో కూడా క్లాప్ మిత్రాలు సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించకుండా గ్రామపొలిమేర్లు, రోడ్ల పక్కన వేసి నిప్పు పెట్టేస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన పంచాయతీ అధికారులే ఇలా చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు.



కాకరాపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



అల్లిపూడి శివారు చెరువు గట్టుపై వేసిన వ్యర్థాలు

డ్రైన్లలో పూడిక తొలగించడం లేదు



గ్రామాల్లో ఎక్కడ చూసినా మురుగు, చెత్త దర్శనమిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో కనీసం కాలిబాటన నడిచే పరిస్థితి లేదు. కాలువల్లో పూడిక తొలగించడం లేదు. రోడ్లను శుభ్రం చేయడం లేదు. పారిశుధ్యం క్షీణించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు పారిశుధ్య పనులను పట్టించుకోవడం లేదు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదే. పల్లెల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలి.

కరక అప్పలనాయుడు, కేఈ చిన్నయ్యపాలెం

నిర్లక్ష్యం నీడలో..

గ్రామాల్లో అపరిశుభ్రత గల ప్రాంతాలను గుర్తించి పంచాయతీ అధికారుల సమన్వయంతో మెరుగైన పారిశుధ్య నిర్వహణ జరిగేలా చూడాల్సిన బాధ్యత పారామెడికల్ సిబ్బందిపై ఉంది. కాగా సిబ్బంది పారిశుధ్య నిర్వహణలో ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం పారామెడికల్ సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకుండా దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరు కావడమేనని స్థానికులు చెబుతున్నారు.

ఆసుపత్రులు కిటకిట

గ్రామాల్లో నెలకొన్న అపరిశుభ్రత, విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పల్లె ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వీరికి ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. మండలంలో 30కి పైగా ఉన్న ఆర్ఎంపీ క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. కాగా ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లెల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

క్లాప్‌మిత్రాలు చేస్తున్న పనులను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాల్సి ఉంది. పంచాయతీ కార్యదర్శులు దూరప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్న నేపథ్యంలో పనులను పర్యవేక్షించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం పారిశుధ్య పనులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రమణయ్యపేటలో చేతి పంపు ప్రారంభం



రమణయ్యపేటలో చేతిపంపు ప్రారంభిస్తున్న డైరెక్టర్ రాజకులపతి

ఏలేశ్వరం: తునికి చెందిన నాసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రమణయ్యపేటలో ఆదివారం చేతిపంపును ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నాసా, వెల్స్‌ఫర్ లైఫ్, మై న్యూ లైఫ్ డైరెక్టర్ రాజకులపతి ఆర్థిక సాయంతో చేతిపంపును ఏర్పాటు చేశారు. దీనిని మై న్యూ లైఫ్ డైరెక్టర్ రాజకులపతి ప్రారంభించారు. కార్యక్రమంలో నాసా సిబ్బంది దొంగబాబు, వెంకటరత్నం, అప్పారావు, యేసుబాబు, ధర్మరాజు, శివకుమార్ పాల్గొన్నారు.

ఆదిత్యలో నేడు జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం వేద-2కే25 పేరిట జాతీయస్థాయి టెక్‌ఫెస్ట్ ప్రారంభించనున్నట్టు ప్రో చాన్సలర్ ఎస్. సతీష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ టెక్ ఫెస్ట్‌లో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ కళాశాలల నుంచి నేరుగా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. టెక్‌ఫెస్ట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ధర్మవరంలో బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ఆదివారం పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు నానిపిల్లి బాబ్జి ఇంటి పనులు చేస్తుండగా పరంజీపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు రూ.ఐదు వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నానిపల్లి చంటి, కోలా తాతబాబు, నల్లా వెంకటేష్, దాడి పుత్రయ్య, నానిపల్లి రమణ, అంబటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రథమ స్థానం పొందిన పావనికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న నిర్వాహకులు

ప్రత్తిపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి అవార్డులు గెలుచుకున్నారు. అమలాపురంలోని బీఆర్‌కే రాజు కన్వెక్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ఒమ్మంగి శ్రీభారతి విద్యా నికేతన్ విద్యార్థులు వి.పావని ప్రథమ స్థానం, ఎస్. సూర్య, ఎస్. కార్తిక్, బి.చైతన్య ద్వితీయ స్థానం సాధించినట్టు కరాటే మాస్టర్ పి.బుజ్జి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

తుని: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఉద్యమం చేపడుతున్నట్లు జగ్గంపేట జేఏసీ చైర్మన్ ఎస్. మురళీకృష్ణ, కన్వీనర్ ఎన్ఎస్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15, 16 తేదీల్లో విద్యుత్ ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతారన్నారు. 17, 18 తేదీల్లో భోజన విరామ సమయంలో అన్ని సర్కిల్ ఆఫీసులు, జనరేటింగ్ స్టేషన్ల ముందు ధర్నా చేస్తామన్నారు. 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. 22న జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ చేసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

ఐక్యతకు ప్రతీక అన్నసమారాధనలు



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని/తుని రూరల్: గ్రామాల్లో ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే అన్నసమారాధనలు ఐక్యతకు ప్రతీక అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. ఎస్.అన్నవరం శివారు శేషాద్రి నగర్‌లో ఆదివారం వినాయక చవితిని పురస్కరించుకుని అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ అన్నసమారాధనను దాడిశెట్టి రాజా ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, నాయకుడు కీర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



శ్రీను

రౌతులపూడి: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14 జూనియర్ ఫెడరేషన్ పోటీల్లో బలరామపురం గ్రామానికి చెందిన పైల శ్రీను ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రీను జిల్లా స్థాయి షార్ట్‌పుట్, జావెలిన్ త్రో పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీను ఈ నెల 25, 26 తేదీల్లో ఏలేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శ్రీను, అతని తల్లిదండ్రులను గ్రామస్తులు అభినందించారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



ఎ.మల్లవరంలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: మండలంలో పార్టీ అనుబంధ కమిటీల నియామకాలు పూర్తి చేసి క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలో ఎ.మల్లవరం, దిగువశివాడ, ములగపూడి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ బలోపేతంపై సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి నేతలు యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్ముకుని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాలు, పట్టణాల్లో రహదారులు ఛిద్రమైనా ప్రభుత్వం, పాలకులకు పట్టడం లేదని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల్లో కోతలు విధించి అర్హులైన లబ్ధిదారుల నోట్లో మట్టి కొడుతున్నారని మండిపడ్డారు. అలాగే వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణరాజు ఎ.మల్లవరంలో పర్యటించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి వాసిరెడ్డి జమీలు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాయి ప్రసాద్, రౌతులపూడి మండల నాయకుడు వాసిరెడ్డి భాస్కరబాబు, పార్టీ రాష్ట్ర వ్యవసాయ విభాగం కార్యదర్శి కాకి నాని, బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, మాజీ సర్పంచ్ నాకిరెడ్డి అప్పలనాయుడు, వడ్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

గోకవరం: బంగాళాపేటకు చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన దోషులను తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. బంగాళాపేటలోని బాధిత కుటుంబాన్ని ఆదివారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు ఉన్నారని వారిని కూడా అదుపులోకి తీసుకోవాలన్నారు. ఒక దళిత బాలికపై అత్యాచారం జరిగి ఆరు రోజుల అవుతున్నా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా, పలు కార్యక్రమాలకు హాజరు కావడం చాలా దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, వెనకబడిన వర్గాలపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించని తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. బాధితురాలికి రూ.25 లక్షల నష్ట పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, పంట భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఎస్పీ స్పందించి ఈ దుర్మార్గానికి మద్దతుగా నిలిచిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి జిల్లా నాయకురాలు సంగీత, రత్నం, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభన రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ పాల్గొన్నారు.

శ్రమదానంతో నరేంద్రగిరికి మార్గం



ప్రత్తిపాడు నరేంద్రగిరి శ్రమదానంలో పాల్గొన్న పెద్దాపురం క్రైమ్ సీఐ అంకబాబు తదితరులు

ప్రత్తిపాడు: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన స్వామి వివేకానంద విగ్రహం ఉన్న ప్రత్తిపాడు నరేంద్రగిరి మెట్ల మార్గం శ్రమదానంతో తిరిగి ఏర్పడింది. స్థానిక జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న నరేంద్రగిరికి పర్యాటకులు వస్తారు. కొండ దిగువ నుంచి పైకి మెట్ల మార్గం ఉన్నా నిర్వహణ లేక తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మెట్ల మార్గం కనుమరుగైంది. ఇటీవల నరేంద్రగిరికి వచ్చిన పెద్దాపురం క్రైమ్ సీఐ ఎల్. అంకబాబు మెట్ల మార్గం మూసుకుపోయి ఉండడాన్ని గమనించి, శ్రమదానంతో మార్గం పునరుద్ధరించాలని సూచించారు. ఈ మేరకు నరేంద్రగిరి అభివృద్ధి కమిటీ ఆదివారం శ్రమదానం చేపట్టి, మెట్ల మార్గం సుగమం చేశారు. శ్రమదానంలో పాల్గొన్న వారికి క్రైమ్ సీఐ అంకబాబు భరతమాత చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, పెద్దాపురం క్రైమ్ సీఐ ఎల్.అంకబాబు, కమిటీ ప్రతినిధులు శింగిలిదేవి సత్తిరాజు, రేపాక ప్రసాద్, జ్యేష్ఠ స్వయం సేవక్ విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



వేళంగిలో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

శంఖవరం: విద్యుత్‌ను ఆదా చేయాలని అధికారులు, ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ వీధి లైట్లు వెలుగుతున్నాయి. గౌరంపేట, పి.మల్లాపురం, వేళంగి, మండపం, వజ్రకూటం తదితర గ్రామాల్లో 365 రోజులు పగలు, రాత్రి తేడా లేకుండా వీధిలైట్లు వెలుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో విలువైన విద్యుత్, ప్రజాధనం వృథా అవుతున్నాయి. మరోపక్క విద్యుత్ బిల్లులు భారం పెరిగిపోతోందని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధిలైట్ల నిర్వహణను సక్రమంగా చేపట్టి విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కాగితమ్మ జాతర



అమ్మవారి గ్రామోత్సవంలో గరగ నృత్యాలు

తొండంగి: మండలంలోని బెండపూడి గ్రామదేవత కాగితమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి పసుపు నీటి బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామశివారులో కాగితమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకాలు చేశారు. అమ్మవారి గ్రామోత్సవంలో గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా



సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

తుని: పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో తుని పట్టణ ఒకటో వార్డు కార్యకర్తలతో ఆదివారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులపై కార్యకర్తలతో చర్చించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ కోసం అందరూ కష్టపడి పని చేయాలన్నారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలందరికీ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



తుని రాజీవ్‌గృహకల్పలో దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న భక్తులు



ఏలేశ్వరంలో దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: దసరా ఉత్సవాలకు పట్టణంలో ఆదివారం పందిరి రాట వేశారు. స్థానిక లింగవరం కాలనీలో జేవీఆర్ ట్రస్టు చైర్మన్ జువ్విన వీర్రాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జువ్విన వీరరాఘవమ్మ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాగా ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, వాగుబలరామ్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం

తుని: స్థానిక రాజీవ్‌గృహకల్ప కాలనీలో వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించే దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం రాట ముహూర్తం చేశారు. కాలనీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రాటను నెలకొల్పి, పసుపు దంచి పనులు ప్రారంభించారు. అనంతరం రాటకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 22న కాలనీ వాసులు భవానీమాలధారణ చేసి అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠిస్తారు. 11 రోజుల పాటు వైభవంగా పూజలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త జగన్మోహన్ తెలిపారు. భక్తులు దసరా ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఏలేశ్వరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2001-2002 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పట్టణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 23 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో తాము చేసిన అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజపూడి టీచర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



శ్రీవాణికి అవార్డు ప్రదానం చేస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో ప్రభుత్వోన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న ఆకెళ్ల శ్రీవాణికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు రాష్ట్రంలో 46 మంది బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. గుంటూరు జిల్లా బ్రాడీపేటలో ఆదివారం అవార్డులు ప్రదానోత్సవం నిర్వహించారు. మాజీ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, సంస్థ ప్రతినిధులు ఆకెళ్ల శ్రీవాణిని శాలువా, పూలమాలలతో సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, కౌతా ధర్మ సంస్థల అధినేత కౌతా సుబ్బారావు, నిమ్మరాజు శారద తదితరులు పాల్గొన్నారు.